ప్రకృతి విరుచుకుపడ్డప్పుడు ఉన్న గూటిని వదలి వెళ్ళడం ప్రాణభీతి వల్ల జరుగుతుంది. అయితే ఉన్న గూటిని వదిలి కన్నవాళ్ళ దగ్గరకు వెళ్ళాలంటే, యింటితో ఉన్న అనుబంధాల్ని తెంచుకొని అక్కడికి వెడ్తే కన్నవాళ్ళతో ఉన్న అనుబంధాలు బెడిసి కొడ్తాయేమన్న భయం చోటుచేసుకొంటుంది.

# తుపాను

ఆనందం వచ్చినప్పుడు పొంగిపోవడం, విచారం వచ్చినప్పుడు కృంగిపోవడం మానవ సహజం. ఆనందంలో యుగాలు క్షణాలుగా మారిపోయినట్టుంటాయి. విచారంలో కాలం స్తంభించినట్టనిపిస్తుంది. నిజానికి కాలగతి ఎప్పుడూ మారదు. జీవితపథంలో మానవుడు బాటసారి మాత్రమే. అతడి గమనాన్నీ, గమ్యాన్నీ కూడా ఏదో అజ్ఞాత శక్తి శాసిస్తూంటుంది. అతని స్వాతంత్ర్యం ఆ పరిధులకు మాత్రమే పరిమితం.

ఆంధ్రదేశపు నడిబొడ్డుకి అది కాళరాత్రి. ప్రళయమే వచ్చి, కాలం స్తంభించిన రాత్రి. ఆ ప్రభంజనానికి తలలు విరిగి తల్లి వేరుతో సహా మహావృక్షాలు మట్టి కరిచిన రాత్రి. ప్రకృతి చేసిన భీకరాట్టహాసానికి గుండెలు పగిలి బడుగు జీవులు నిర్జీవులైన రాత్రి. పెను తుపాను ఫెళ, ఫెళమని విరిగి మీద పడితే మానవుడు తానింత 'మరుగుజ్జునా?' అని విస్తుపోయిన రాత్రి.

ఆనాటి తుపాను ధాటికి అల్లల్లాడి పోయిన తీరప్రాంతపు పల్లెటూళ్ళలో గునుపూడి కూడా ఒకటి. ఆ వూరికి ఉత్తరంగా విసిరేసినట్టుంటుంది జగన్నాథంగారి పాత పెంకుటిల్లు. ఆ యింట్లో బిక్కు బిక్కుమంటూ కాలక్షేపం చేస్తున్న వృద్ధ జీవాలు ఆయనా, భార్యా శేషమ్మానూ.

ఆ యింటి పై కప్పు మీది పెంకులది జగన్నాథం గారి తండ్రిగారి వయస్సు. ఈనాటి తుపాను ఉధృతాన్ని ఎదుర్కొలేక అవి ఎండుటాకుల్లా ఎగిరి పోవడంలో ఆశ్చర్యం ఏముంది? ఆ తరువాత కుండపోతగా వర్షం. ఇల్లంతా వరద. మంచాలు ఓ వారగా జరుపుకుని పడుకునేందుకు కూడా వీలులేదు. విధిలేక ముసలి దంపతులు, అర్థరాత్రప్పుడు లేచి గదుల్లో నిండుతున్న నీరు చెంబుతో తోడి, బిందెల్లో నింపి బైట పారబోయాల్సి వచ్చింది. ఇంట్లో మరెవరూ లేరాయె! అలిసిన జగన్నాథం గారు అంతకంటే అలిసిపోయిన భార్య శేషమ్మతో అన్నారు.

"శేషూ నిన్నీ వయసులో ఎంత కష్టపెడుతూన్ననే!" అని.

"అలా అనకండి. మీది మాత్రం పెద్ద వయసు కాదూ! మీ ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ తుపాను ఏమిటో! విధి వైపరీత్యం!" అంది శేషమ్మగారు.

అర్ధ శతాబ్దంగా తన అర్ధాంగిగా ఉండి తనతో సుఖఃదుఖాలు పంచుకుంటూ, చేదోడు వాదోడుగా ఉంటోంది. ఒకరి కోసం మరొకరు అనుకుంటూ బతికేరు వారిద్దరూ! ఈ రోజు శేషమ్మగారి పరిస్థితి చూసి చలించిపోయారు జగన్నాధంగారు.

ఇలాంటి తుపానులు కనీ వినీ ఎరగని వేమీ కాదు. ఇంతకంటే పెద్ద తుపానుల్ని జీవితంలో ఎదుర్కొని పోరాడాడు. చేతికందొచ్చిన బంగారంలాంటి పెద్దకొడుకు విషజ్వరంతో పోతే గుండె రాయి చేసుకున్నాడు. సలక్షణంగా పెళ్లి చేసి అత్తవారింటికి పంపిన కూతురి మొగుడు అవసరం తీరాక, సన్యాసుల్లో కలిసి, అది ఇద్దరు ఆడపిల్లల్తో ఇంటికి తిరిగొస్తే కడుపులో దాచుకుని ఆదరించాడు. వాళ్ల ఆలనా పాలనా చూశాడు. అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసి, పెద్ద చదువులు చదివించిన మూడో కొడుకు రాజు అందర్నీ కాదని కులం కానిదాన్ని పెళ్ళి చేసుకొని, తమతో బంధాలన్నీ తెంచుకొని విదేశాలకి పోతే, "పోనీ లే వాడు చక్కగా బతికితే చాలు" అని సంతోషించాడే కాని, 'ఇలా ఎందుకు జరిగింద'ని విచారించలేదు.

ఒకే కుటుంబంలో పుట్టిన అందరు పిల్లలూ ఒకేలా ఉండరు. రెండోవాడు భాస్కరానికి, చిన్నప్పట్నుంచీ అమ్మా, నాన్నలంటే అంతులేని అభిమానం. వాళ్ల ఆనందం కోసం ఏమైనా చేయగలడు. వాడిప్పుడు హైద్రాబాద్‌లో ఓ చిన్న ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని ఆదుకుంటున్నాడు.

ఇలా తుపాను పోతే తుపాను. తుపానుకీ తుపానుకీ మధ్య ప్రశాంతత. అదే జీవితం. అప్పుడా పోరాటంలో ఆనందం ఉండేది. నెగ్గాలనే పట్టుదల ఉండేది. ఆనాడు గంపెడు పిల్లలత్తో ఇల్లు బిల బిల లాడుతుంటే, నీటిలో చేపలా సంసారాన్ని ఈదేశాడు. భూదేవిలాంటి శేషమ్మ సరసన జీవితమెప్పుడూ భారమనిపించలేదు. ఆ రోజులు వేరు. ఆ వయసు వేరు. అప్పటి శక్తి సామర్థ్యాలు వేరు.

కానీ ఇప్పుడు వయసు మీరింది. అప్పటి జవసత్వాలు లేవు. కాలం తన ప్రభావాన్ని చూపుతోంది. శారీరకంగానూ, మానసికంగానూ అలసట తెలుస్తోంది. అందుకే జగన్నాధం గారు చలించిపోయారు. ముఖ్యంగా ఈనాటి పెను తుపాను. తన అసహాయత, ఎదురుగా సహ ధర్మచారిణి కష్టం. అంతా చూశాక సమూలంగా కదలిపోయాడు. ఆయన మనసులో చెలరేగే తుపానుకి నాందిగా, ఒక ప్రశ్నల సుడిగుండం వ్యాపించింది. 'ఎందుకు ఇదంతా? నా పని సరే! కాని నన్నే సర్వస్వం అని నమ్మికొని నిరంతరం నాకు సేవలు చేస్తున్న ఈ అమాయకురాలిని ఇలా అవస్థ పెట్టే అర్హతగాని అధికారంగాని నాకెక్కడివి? ఇదెంత వరకు సమంజసం? ఇది తప్పనిసరా? అంటే, కాదే! దీనికి కారకులెవరు? నేను కాదా?'

హైద్రాబాద్ నుంచి భాస్కరం ఎన్నాళ్లనుంచో రాస్తున్నాడు. ఇద్దర్నీ తన దగ్గరికి వచ్చేయమని. తనే అందుకంగీకరించలేదు. కాదూ కూడదంటే తనే ఉద్యోగం మానేసి ఇక్కడి కొచ్చేస్తానన్నాడు. అందుకు తానంగీకరించలేదు. వాడి భవిష్యత్తుకి అది భంగకరం కదా! 'ఇలా అవస్థ పడుతూ ఈ వయసులో మీరెందుకిక్కడ? నా దగ్గరికి వచ్చేయండి. పువ్వుల్లో పెట్టి పూజిస్తాను' అని బ్రతిమాలాడాడు భాస్కరం. వాడి విషయంలో తనకి అంతటి

భరోసా ఉంది. అయినా మనసెందుకో అంగీకరించలేదు. ఉన్న ఊరు వదిలి పెట్టేయాలంటే అదోలా అనిపించింది. ఉన్న ఊరూ, కన్నతల్లీ అన్నారు అందుకే గాబోలు.

ఆలోచన వస్తేనే పేగు లాగుతోంది. వాడు నాది మొండి పట్టుదలే అనుకున్నాసరే, వెళ్ళాలనిపించలేదు. శేషు సంగతి సరే. నేనన్న మాట తానెప్పుడు కాదందనీ!

సాలోచనగా భార్య వైపు చూశారు జగన్నాథంగారు. తనూ ఆయన్నే చూస్తోంది. ముసలి వయసులో నా బాధని చూసి నా మీద జాలి పడుతోందో ఏమో? చెమర్చిన కళ్లలో భావాలు చదవడం ఎలా సాధ్యం? దాని మనసులో ఏముందో తెలుసుకోవడం చాలా కష్టం. ఎప్పుడూ తనంతట తాను బైట పడి ఏమీ చెప్పదుకదా!

ఆలోచనల వాయుగుండంలోంచి వెచ్చటి పిల్ల వాయువులా ఓ భావన. ఇప్పుడు మాత్రం మించిపోయిందేముంది? నా కోసం కాకపోయినా ఈమె కోసమైనా భాస్కరం దగ్గరికి హైద్రాబాద్ వెళ్లిపోతే ఏం? ఇక్కడ పుట్టేం మునిగిపోతుంది? ఇవ్వాళో రేపో కూలిపోయే ఈ పాత పెంకుటింటిని పట్టుకొని ఊగులాడడం దేనికి?

ఇలా ఆలోచిస్తూ "శేషూ" అని మెల్లిగా అన్నారు జగన్నాథం గారు. సమాధానంగా "ఊ!" అందామె.

"మనం హైదరాబాద్ భాస్కరం దగ్గరకెళ్లి పోదామే! పాపం ఎన్నాళ్లనుంచో మనల్ని వచ్చేయమని ప్రాధేయపడుతున్నాడు. ఇహ మనమీ ఒంటరితనం భరించలేము. ఏమంటావ్?" అని అడిగారు జగన్నాథంగారు.

ఆమె అదోలా చూసి నవ్వి ఊరుకుంది. దానికి జగన్నాథంగారు తనకిష్టమైన అర్థం చెప్పుకోవచ్చును. ఆ తర్వాత ఇద్దరి మధ్యా నిశ్శబ్దం చోటు చేసుకుంది. ఇద్దరూ ఆలోచనల్లోకి జారుకున్నారు. ఒకసారి హైద్రాబాద్ వెళ్లిపోదామనే ఆలోచన వచ్చాక, ముందు ముందు అక్కడెలా ఉంటుందోననే బితుకు పట్టుకుంది. గునుపూడి లాంటి పల్లెటూళ్లో, పెంకుటింట్లో బతికేయడం ఒక ఎత్తు. హైద్రాబాద్ వంటి మహానగరంలో నిత్యం పరుగులెత్తే మనుషుల మధ్యలో, ఆరేడంతస్తుల మేడల్లో, అగ్గిపెట్టెల్లాంటి ఇరుకు గదుల్లో జీవించడం మరొకెత్తు. భాస్కరం అంటే తనకెంత గురి ఉన్నా, వాడి భార్యా పిల్లలూ, వాడి కష్టాలు వాడికుంటాయి. అల్లాంటి పరిస్థితుల్లో, తనూ శేషూ వాళ్లకి ఓ సమస్యగా తయారైతే?....భావి జీవితాన్ని తల్చుకుంటే భయంగా ఉంది.

ఇక్కడి పరిస్థితి వేరు. ఇవన్నీ తను పుట్టి పెరిగిన పరిసరాలు. ఈ యింట్లో అణువణువూ తనకు పరిచితమైనది. తరతరాలుగా ఈ యింట్లో తన కుటుంబం నివసిస్తోంది. ఇంటి విషయం తల్చుకోగానే జగన్నాథానికి ఒళ్లు పులకరించింది. ఎవరో ఆత్మీయుల్ని తలుచుకున్నట్టనిపించింది. అదొకలాంటి విప్పి చెప్పలేని తీపి భావన. తను ఈ యింట్లో పుట్టాడు. తనపిల్లలంతా ఈ యింట్లో పుట్టినవాళ్లే. తను తప్పటడుగులు వేసి నడచిన ఈ నడవలోనే తన పిల్లలు నడవడం నేర్చుకున్నారు. తన చిన్నతనంలో ఇంటికి వెనక పక్కన పెరట్లో ఓ పెద్ద రాచఉసిరి చెట్టుండేది. ఓనాడు అది ఎక్కిపడ్డాడు తను. అప్పుడు నాన్న ఎంత ఉగ్రుడయ్యాడో! "చిలిపి వెధవా! ఏ కాలో, చెయ్యో విరిగితే నేనేమైపోవాలి?" అని దెబ్బలాడి, తరవాత కళ్లనీళ్ళెట్టుకున్నాడు. ఆ తరవాత ఆ చెట్టు కొట్టించేశాడు. ఆ రోజుల్లో

గునుపూడిలో చదువుకునేందుకు బడి ఉండేది కాదు. ఆ చుట్టుపక్కల నాలుగు ఊళ్ళకీ 'పేట'లోనే బడి. వర్షాకాలంలో బడి నుంచి తిరిగి వస్తూ, జోరుగా పారే కొండవాగుల్లో నిలబడి, కాలు కింద ఇసుక కోసుకుపోతుంటే ఎగిరి గెంతులేస్తే తోటి పిల్లల్తో ఆడుకునేవాడు. తనకి పెళ్ళై, పిల్లలు పుట్టేసరికి గునుపూడిలోనే పెద్ద బడి వచ్చేసింది. చదువుల కోసం ఎగబడేవాళ్ళు కూడా ఎక్కువయ్యారు. తన జీవితం ఈ యింట్లోనే ఎన్నో మలుపులు తిరిగింది. వివాహం, పిల్లలూ, చదువులూ అంతా ఇక్కడే!

మూల గదిలో పెద్దవాడు పుట్టినప్పుడు శేషు ఎంత మురిసిపోయిందో, 'నా బంగారం' అని వాణ్ణి ముద్దెట్టుకునేది. వాడికి గోరుముద్దలు తినిపిస్తూ "వీడే నా తలకి కొరివి పెట్టా"లని కోరుకునేది. పిచ్చిమొహం! దానికేం తెలుసు వాడు అర్థాయుష్కుడౌతాడని. ఆ మాటకొస్తే తను మాత్రం తెలుసుకోగలిగాడా తన భుజాల మీదుగా వాడి పాడె వెళ్తుందని. తరువాత ఆడపిల్ల, తరువాత భాస్కరం పుట్టాడు. చిన్నప్పటి భాస్కరాన్ని తల్చుకుంటే వీడేనా ఇంతటి వాడైంది అనిపిస్తుంది. ఎప్పుడూ ఏదో జబ్బుతో బాధపడుతూండేవాడు. అర్భకంగా ఉండేవాడు. వయసు వస్తే వాడే బాగు పడతాడులే అని సర్దిపెట్టుకున్నాడు తాను. అలాగే జరిగింది కూడా.

తరవాత పుట్టినవాడు రాజు. చదువుల్లో చురుకుగా ఉండడంవల్ల చాలా పెద్దవాడౌతాడని ఆశించాడు. ఆ ఆశలు వాడు నిరాశలు చేయకపోయినా, జీవితంలో మాత్రం నిరాశ నింపిపోయాడు. వాడు కుటుంబానికి అక్కరకి రాకపోయినా, అమెరికాలో చక్కగా బతుకుతున్నాడంటే, అదొకలాంటి సంతోషం మరి.

ఒక్కొక్క సంఘటననీ మననం చేసుకుంటూ పోతే, అవన్నీ తన జీవితంలో ఈ యింట్లోనే జరిగాయన్న విషయాన్ని తల్చుకుంటే, అలాంటి ఇంటిని, ఇవ్వాళ ఏదో ఆపద వచ్చిందని, కొంచెం పాడయిందని చిన్న కష్టంలో ఉన్నామనీ వదిలిపెట్టి వెళ్ళిపోవడమే! పక్షుల్లా తామెరిగిపోతే, ఈ గూడు ఇంకా పాడై పోదూ! "అమ్మో" అనిపించింది.

ఆ విషయం తల్చుకుంటేనే గుండె తరుక్కుపోతోంది. మానవుడికి మమకారం అనే గుణాన్ని ఎందుకిచ్చాడో భగవంతుడు? జరిగిందేదో జరిగింది. ఇంక ఈ జీవితంలో ఈ యిల్లు వదలిపెట్టడమనే ప్రసక్తి లేదు. నాకంటే శేషు తెలివైంది. దానికి నా ఈ అశక్తత తెలుసు. "వెళ్ళిపోదామే!" అని నేనన్నదానికి అది చేసిన మందహాసానికి అర్థం అదే!

'పిచ్చివాడు! అది నీ తరం కాదులే' అని.

ఇలాగే ఆలోచిస్తూ "శేషూ! మనం వెళ్లొద్దే" అన్నారు జగన్నాథం గారు ఆమె వైపు చూస్తూ.

శేషమ్మగారు చిన్నగా మందహాసం చేసి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. 'ఆ విషయం నాకు ముందే తెలుసులెండి!' అని ఆమె అన్నట్టు ఆయనకనిపించింది.

బైట తుపాను ఉధృతం తగ్గింది. ఎంత కాలం ఉంటుందేంటి?! జగన్నాథంగారి మనసులో ఆలోచనలో ఉధృతం తగ్గింది. తెల్లగా తెల్లారి అన్ని వస్తువులు తేటతెల్లంగా కనిపిస్తున్నాయి. జగన్నాథంగారి మనసు ప్రశాంతతని సంతరించుకుంది. అది తుపాను తరువాతి ప్రశాంతత.

✱